క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రామగిరి(నల్లగొండ) : సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని డీఎస్పీ శివరాం రెడ్డి అన్నారు. మండలంలోని నర్సింగ్‌భట్ల గ్రామంలో సోమవారం సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు సహాయపడుతున్నాయన్నారు. నేరస్తులను గుర్తించడంలో ఉపయోగపడుతాయన్నారు. ప్రజలందరూ తమ ఇళ్లు, దుకాణాలు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాఘవరావు, ఎస్‌ఐ సైదా బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సత్యం

నల్లగొండ టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆస్పత్రి కాంట్రాక్టు వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు ఎల్లమ్మకు మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ అరుణకుమారిని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను ఆయన పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సరైన వైద్యం అందించి త్వరలో కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ నగేష్,పల్లా దేవేందర్‌రెడ్డి, బడిగెల వెంకటేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

నల్లగొండ టౌన్ : సోషల్ వెల్ఫేర్ గురుకులాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వేతనాలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పెరుమాళ్ల సత్యనారాయణ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: తెలంగాణ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలను ఈనెల 26, 27 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపటంలో నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలె సత్యనారాయణ తెలిపారు. సోమవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 500మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పానగంటి లక్ష్మమ్మ, యాదమ్మ, అల్లి అనురాధ, కిన్నెర సైదమ్మ, అంజమ్మ, శంకరమ్మ, పుష్పలత, ఇందిర, ధనమ్మ, లక్ష్మీ, కళమ్మ, రేణుక, వెంకటమ్మ, సత్యమ్మ పాల్గొన్నారు.

ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవ'

నల్లగొండ : ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ నల్లగొండ డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ సఫాయి కార్మికులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌సీఐ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ, పార్కులు, తదితర బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచడం, సఫాయి కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసిన సంస్థ ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ప్రసాద్, కృష్ణవేణి, ఆదిమళ్ల శంకర్, కాశీరెడ్డి, భాస్కర్, సునంద, సరిత, స్వాతి, సతీష్ రెడ్డి పాల్గొన్నారు.


సఫాయి కార్మికురాలిని సన్మానిస్తున్న ఎఫ్‌సీఐ డీఎం సువీన్‌కుమార్

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే బాలునాయక్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దేవరకొండ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో దేవరకొండ, నేరేడుగొమ్ము, చందంపేట, డిండి మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొత్త,పాత తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన కోరారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేసే వారికి అవకాశాలు తప్పకుండా వస్తాయన్నారు. అభ్యర్థుల ఎంపిక సైతం పారదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల ముఖ్యనాయకులున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



ఆగామోత్కూర్‌కు వెళ్లే రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న కాల్వ

మాడుగులపల్లి : మండల కేంద్రం నుంచి ఆగామోత్కూర్‌కు వెళ్లే రహదారి పక్కన కాల్వ ప్రమాదకరంగా ఉంది. కాల్వ వెంట పిచ్చి మొక్కలు విపరీతంగా పెరగడంతో ప్రయాణికులకు ఆ చిన్నపాటి కాల్వ కనిపించదు. ద్విచక్ర వాహనదారులు చూసుకోకుండా రహదారి పక్క నుంచి వెళ్తే కాల్వ గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న కాల్వకు మరమ్మతులు చేపట్టకపోగా కనీసం సూచిక బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న కాల్వ వద్ద ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేసి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా బోధన ఉండాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వాణి

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో పాటు కథలు చెప్పుతూ వారి మానసిక ఎదుగుదలకు తోడ్పడేలా బోధన అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.వాణి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలం బండమీదిగూడెం సెక్టార్ పరిధిలో గల ఉట్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషక మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. పోషణ లోపానికి గురైన పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగమ్మ, కిశోర బాలికలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై అగ్రవర్ణాలకు కడుపు మంట


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 6 శాతం కూడా లేని అగ్రవర్ణాలకు కడుపు మంట ఎందుకని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రశ్నించారు. సోమవారం మిర్యాలగూడలోని బీసీ సంఘం కార్యాలయంలో జరిగిన యువజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అగ్రవర్ణాలకు చెందిన పలువురు సుప్రీం కోర్టు, హైకోర్టులో పిటిషన్ వేయడం సిగ్గు చేటన్నారు. జనాభాలో 62 శాతం మంది బీసీలు ఉంటే కేవలం 42 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, దీనిని జీర్ణించుకొని అగ్రవర్ణాలు రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. జనాభాలో 5 శాతం మాత్రమే ఉన్న అగ్రవర్ణాలకు ఎలాంటి సర్వే లేకుండానే 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్లు తెలిపారు. అగ్రవర్ణాల కుట్రలను తిప్పి కొట్టాలంటే బీసీలంతా ఏకం కావాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గంగాధర్, ఉపేందర్, మహేష్, కుమార్, రాజేందర్, సాయి, ప్రసాద్, సతీష్ తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. నీట మునిగిన చేలు


తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పత్తిచేనులోకి చేరిన వర్షపు నీరు


తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నీట మునిగిన వరి పంట

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు రాత్రి పది గంటలకు ప్రారంభమైన వర్షం గంట పాటు ఎడతెరిపిలేకుండా కురిసింది. దీంతో పత్తి, వరి పంట నీటమునిగాయి. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికే నీట మునిగిని దెబ్బతిన్న పత్తి పంట ఆదివారం రాత్రి కురిసిన వర్షం పత్తి రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పటికే ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట ఎర్రబారుతుంది. ముందస్తుగా సాగు చేసిన పత్తి పంటలో ప్రస్తుతం పత్తితీత పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో పత్తికాయలోకి నీరు వెళ్లడంతో కాయలు నల్లబడి పాచిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షం పత్తి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని, చేతికి వచ్చిన పంట చేజారిపోతుందని పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్ : బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన నిధులను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖంబంపాటి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో 1650మంది విద్యార్థుల బకాయిలు రూ. 11కోట్లు విడుదల చేయాల్సి ఉందని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు.

అంధకారంలో జాతీయ రహదారి


హైవేపై వెలగని వీధి దీపాలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రం మీదుగా వెళ్లే 167వ జాతీయ రహదారిపై వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలుముకుంది. దీంతో రాత్రి సమయంలో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరి గితే బాధ్యత ఎవరు వహిస్తారంటూ వాపోతున్నా రు. ఇప్పటికైన అధికారులు మేల్కొని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోర్టు వాయిదాలకు హాజరుకాని నిందితుడి అరెస్ట్

నాగార్జునసాగర్ : చీటింగ్ కేసులో2022లో అరెస్ట్ అయి కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న తీర్థాల నాగేశ్వర్‌రావును నాగార్జునసాగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. రెంటల సత్తెనపల్లికి గ్రామానికి చెందిన నాగేశ్వరావుకు నిడమనూరు కోర్టు మెజిస్ట్రేట్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. సాగర్ పోలీసులు పట్టుకొని నిడమనూరు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి 14రోజులపాటు జ్యూడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ ముత్తయ్య పేర్కొన్నారు.

ప్రధాన రోడ్లపై గుంతలు పూడ్చాలని వినతి


ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలు పూడ్చాలని కోరుతూ సోమవారం మిర్యాలగూడ ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీధర్‌కు బీజేపీ వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకటరమణ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ఖమ్మం, నల్లగొండ, సాగర్ రోడ్లలో ప్రధాన కూడలైన తడకమళ్ల ఎక్స్‌రోడ్డు, ఈదులగూడెం చౌరస్తా, సాగర్ రోడ్డులో ఫ్లెవైర్ బిడ్జి వద్ద గుంతలు, వాహనాల రాకపోకలకు దుమ్మూధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాపర్తి శ్రీనివాస్, యరెడ్ల రామకృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ వినియోగంతో అనర్థాలపై వినూత్న ప్రచారం


డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ప్రభాకర్

వేములపల్లి : డ్రగ్స్‌కు బానిసై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూర్యాపేట జిల్లా గోరంట్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై సోమవారం వేములపల్లి మండలంలోని సల్కునూరు క్రాస్ రోడ్డు వద్ద ఆయన ప్రత్యేక వేషధారణలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ జోలికి వెళ్లకుండా సక్రమ మార్గంలో నడిచి మంచి పౌరులుగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిసి నష్టాలపై జిల్లాలోనే కాకుండా దసరా సెలవుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బైక్ యాత్ర నిర్వహించి యువతకు సందేశం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్రికెట్ లీగ్ ఛాంపియన్‌గా క్లియో జట్టు



దసరా క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన క్లియో జట్టు

మిర్యాలగూడ : పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో క్లియో స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరిగిన దసరా క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌లో క్లియో జట్టు విజేతగా నిలిచింది. చేతన్ క్రికెట్ అకాడమీ సూర్యాపేట, క్లియో క్రికెట్ అకాడమీ మిర్యాలగూడ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో క్లియో జట్టు 16 పరుగులతో విజయం సాధించిందని టోర్నమెంట్ నిర్వాహకులు, కోచ్ కావలి వెంకన్న సోమవారం తెలిపారు. కాగా టోర్నమెంట్‌లో ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబరిచిన ధీరజ్, రామస్వామిలు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక కాగా బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా మంజునాథ్, బెస్ట్ బౌలర్‌గా ఈశ్వర్, బెస్ట్ ఫీల్డర్‌గా సాధిక్‌పాషా, ఫైనల్స్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా డోలా కృష్ణ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రామకృష్ణ, రాజు, అనుదీప్, మస్తాన్ తోపాటు సాయికృష్ణ, జవహర్‌లాల్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీపై అప్రమత్తంగా ఉండాలి


సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్‌ఐ నాగేంద్రబాబు

చందంపేట : సెల్‌ఫోన్‌ల చోరీపై అప్రమత్తంగా ఉండాలని నేరెడుగొమ్ము ఎస్‌ఐ నాగేంద్రబాబు సూచించారు. ఇటీవల మండ పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న పది మందికి సోమవారం నేరెడుగొమ్ము పోలీస్ స్టేషన్‌లో రూ.2లక్షల విలువైన పది సెల్‌ఫోన్లను వారికి తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బ్యాంక్, కేవైసీ, ఇతర ఫేక్ మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది మహేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో దళిత కులాల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న కరణ్‌జయరాజ్

నల్లగొండ టౌన్: అంబేడ్కర్ ఆశయాలను పరిపూర్ణం చేసేందుకు దళిత కులాల ఆత్మీయ సమ్మేళనం, 'అంబేడ్కర్ వారసుల అలయ్ బలాయ్' కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నట్లు మహనీయుల ఆశయ సాధన సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్ జయరాజ్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత కులాలకు జరుగుతున్న నష్టాలను నివారించేందుకు దళితులంతా ఏకం కావల్సిన అవసరం ఉందన్నారు. విడిపోతే నష్టం జరిగే అవకాశం ఉన్నందున దళిత సంఘాలన్ని ఐక్యం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కత్తుల షన్ముకకుమార్, జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, సంఘాల నాయకులు నజీర్, అబిమన్యు శ్రీనివాస్, గోలి సైదులు, కత్తుల తులసిదాస్, వంటెపాక యాదగిరి, అద్దంకి రవీందర్, కొండేటి వెంకట్, చింత శివరామకృష్ణ, ఇరిగి ప్రసాద్, పెరిక అంజయ్య, కత్తుల సన్ని, విజయ్, కాశినాథ్, సందీప్, స్వామి పాల్గొన్నారు.

కంబాలపల్లి వీధులు బురదమయం





చందంపేట : మండలంలోని పాత కంబాలపల్లిలో వీధులన్నీ బురదమయంగా మారాయి. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, మురుగు నీటి పారుదల అస్తవ్యస్తంగా ఉంది. దీంతో మురుగు నీరు వీధుల వెంట పారుతుండడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. దీనికి తోడు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలుకోరుతున్నారు.

మాజీ కౌన్సిలర్‌కు పలువురి నివాళి


రామకృష్ణ(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ(52) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు(రాంనగర్) మాజీ కౌన్సిలర్ రామకృష్ణ ఛాతినొప్పితో ఇంట్లో పడిపోగా అతడిని గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించి వైద్యసేవలు అందిస్తుండగానే పరిస్థితి విషమించి మృతిచెందారు. అతడికి భార్య సంధ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ లతో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేశ్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మహాలింగార్చన, పుష్పార్చన అనంతరం గోపూజ జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శంభిరెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సుందరమ్మకు నివాళి

హుజూర్‌నగర్ : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన రిటైర్డు ఏఎన్‌ఎం కనక సుందరమ్మ (83) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామస్తులు, రిటైర్డు ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

గుడిపల్లి ఏఓగా రాజు


ఏఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల వ్యవసాయ అధికారిగా పసుల రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించాడు. నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండలానికి జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం ఏఈఓగా పనిచేసిన ఆయన ఏఓగా పదోన్నతి పొంది గుడిపల్లి మండల వ్యవసాయ అధికారిగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ అనుమతి లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజారులో నాళాకు దగ్గరగా నిర్మాణాలు చేపడుతున్న ప్రహరీని పోలీస్ బందోబస్తుతో వెళ్లి మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకాశంబజారులో చోటు చేసుకున్న ఆక్రమణ వ్యవహారంపై ఇరువురు డాక్యుమెంట్‌లను టౌన్‌ప్లానింగ్ అధికారులకు చూపించాలని సూచించారు. ఇష్టానుసారంగా ఎవరైనా నిర్మాణాలు చేపట్టినా సహించేదిలేదని, నాలా అక్రమణకు సంబంధించి నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ నిర్మాణాలు చేపట్టరాదని నిర్మాణదారులకు సూచించారు. నాలా ఆక్రమిస్తే వరదలు వచ్చినప్పుడు ఇళ్లలోకి, దుకాణాల్లోకి వరద నీరు చేరి అందరూ నష్టపోతారన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్మాణాలు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏసీపీ కృష్ణవేణి, ఇతర సిబ్బంది ఉన్నారు.